# అభివృద్ధిని చూసి ఓటు వేయాలి

● బీఆర్ఎస్ పార్టీలోకి భారీగా చేరికలు ● కాంగ్రెస్ పార్టీ హామీలను నమ్మితే గోస తప్పదు



పెద్దకొత్తపల్లి: ఎమ్మెల్యే బీరం సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన యాపట్ల కాంగ్రెస్ కార్యకర్తలు



పాన్‌గల్ : తెల్లరాళ్ల పల్లి తండాలో గిరిజనులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

పెద్దకొత్తపల్లి/పాన్‌గల్/వీపనగండ్ల, నవంబర్ 13: మండల పరిధిలోని యాపట్ల గ్రామానికి చెందిన 50 మంది కార్యకర్తలు ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ కొల్లాపూర్ నియోజకవర్గంలో ఐదేండ్లలో చేపట్టిన అభివృద్ధి మీ ముందు కనిపిస్తున్నదన్నారు. పెద్దకొత్తపల్లి మండలంలో నేను చేసిన అభివృద్ధి ప్రతి గ్రామంలో ప్రజలు చూసి ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ ప్రాంత రైతుల సంక్షేమం కొరకు నిరంతరం కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ నాయకుల మాయ మాటలు విని మోసపోవద్దన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో మరింత అభివృద్ధి చేసేందుకు మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఆగ్రామ ఉపసర్పంచ్ అజయ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు ప్రసాదరావు, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

**బీరంను గెలిపిద్దాం..**

గత పాలకుల హయాంలో అభివృద్ధిని, బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని బేరీజు వేసుకొని బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డికి ఓటేయాలని బీఆర్ఎస్ రాష్ట్రనాయకులు రంగినేని అభిలాష్‌రావు, పాన్‌గల్ మండల ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రాముయాదవ్ అన్నారు. సోమవారం పాన్‌గల్ మండలంలోని శాగాపూర్, మాధవరావుపల్లి, శాగాపూర్, తెల్లరాళ్లపల్లి తండాలలో వారు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్‌ను నమ్మితే గోస తప్పదని తెలిపారు. రైతుల బాగు కోరే సీఎం కేసీఆర్‌కు మద్దతుగా నిలవాలని, అందుకు కారుగుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల సమన్వయకర్త వెంకటయ్యనాయుడు, నాయకులు రఘుపతినాయుడు, జ్యోతినందన్‌రెడ్డి, సోమ్‌నాథ్‌నాయక్ పాల్గొన్నారు.

**కాంగ్రెస్ కుట్రలను ఛేదించి...**

వీపనగండ్ల మండలంలోని కల్వరాల గ్రామానికి చెందిన బాబా, రాముడు, సుధాకర్, కృష్ణయ్య మాయమాటలతో వారం క్రితం కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ శ్రేణులు కాంగ్రెస్ కుట్రలను ఛేదించి, తిరిగి సోమవారం సొంత గూటికి చేరారు. దీంతో వారికి గులాబీ కండువాలు కప్పి ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ఆహ్వానించారు. తప్పుడు విదానాలతో కాంగ్రెస్ పార్టీలోకి బలవంతపు చేరికల కుట్రలకు ప్రజలు మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ కమలేశ్వర్ పాల్గొన్నారు.

## గువ్వలపై దాడి అప్రజాస్వామిక చర్య

● ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఖండన



దవాఖానలో గువ్వల బాలరాజును పరామర్శిస్తున్న బీరం హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్, నవంబర్ 13: ఉప్పునుంతల మండలంలో శనివారం రాత్రి ఎన్నికల ప్రచారం ముగించుకొని వస్తుండగా అచ్చంపేట బీఆర్ఎస్ అభ్యర్థి, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజుపై కాన్వాయ్‌పై కాంగ్రెస్‌నాయకులు దాడి చేసి గాయపరిచిన సంఘటనపై కొల్లాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి తీవ్రంగా ఖండిస్తూ అప్రజాస్వామిక చర్యగా అభివర్ణించారు. హైదరాబాద్‌లోని యశోద దవాఖానలో చికిత్స పొందుతున్న గువ్వలను ఆదివారం బీరం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగితెలుసుకొని సంఘటన వివరాలను తెలుసుకున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రచారం చేసుకునే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, అప్రజాస్వామిక చర్యలకు పాల్పడడం కాంగ్రెస్ నాయకులకు తగదని అన్నారు. ఈ ఘటనను ప్రజాస్వామికవాదులంతా తీవ్రంగా ఖండించాలని పిలుపునిచ్చారు.

## కాంగ్రెస్‌కు ఓటేస్తే ఉరేసుకోవాల్సిందే..

కొల్లాపూర్, నవంబర్ 13: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేస్తున్న పారాచూట్ కాంగ్రెస్ అభ్యర్థులకు ఓట్లు వేస్తే ఉరివేసుకోవాల్సిందేనని తెలంగాణ మాదిగ దండోరా జిల్లా అధ్యక్షులు దేవని కుమార్ మాదిగ స్పష్టం చేశారు. సోమవారం ఆ సంఘం నాయకులు చారకొండకృష్ణ, రాము, అంజితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇది ఒక్కప్పటి కాంగ్రెస్ పార్టీ కాదని, ఇది టికెట్లు అమ్ముకునే బిజినెస్ కాంగ్రెస్ పార్టీ అని ఎద్దేవా చేశారు. 19 ఏండ్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పదవులు ఒరగబెట్టిన జూపల్లికృష్ణారావు చిన్నంబావి మండలం సొంత గ్రామం పెద్దదగడలో సోమవారం ఎన్నికల ప్రచారానికి వెళ్తే ఆ గ్రామ మహిళలే ఏం అభివృద్ధి సాధించావని గ్రామంలోకి వచ్చి ఓట్లు అడుగుతున్నావని నిలదీశారన్నా. కర్ణాటకలో ఐదు గ్యారెంటీ పథకాలకు మోక్షం లేక ఆ రాష్ట్ర ప్రభుత్వం అభాసుపాలైందన్నారు. అదే పార్టీ నాయకులు తెలంగాణలో ఆరు గ్యారెంటీ పథకాల గురించి ఓట్ల లబ్ధి కోసం కారుకూతలు కూస్తూ ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారని ఆరోపించారు.

## బీరం గెలుపు కోసం పాదయాత్ర



పాన్‌గల్ మీదుగా పాదయాత్ర చేస్తున్న రంగాపూర్ శివారెడ్డి తదితరులు

పాన్‌గల్, నవంబర్ 13: కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరుతూ సోమవారం హర్షన్న యువసేన తాలూకా అధ్యక్షుడు రంగాపూర్ శివారెడ్డి అయ్యప్పస్వామి వేశధారణలో తన అనుచరులతో కలిసి మండల కేంద్రం నుంచి సింగోటం లక్ష్మీ నరసింహస్వామి ఆలయం వరకు పాదయాత్ర చేశారు. ఎమ్మెల్యేగా బీరం హర్షవర్ధన్‌రెడ్డి కొల్లాపూర్ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. కార్యక్రమంలో శాగాపూర్ సర్పంచ్ మౌనిక, నాయకులు తిరుపతి యాదవ్, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మ దేవతకు మొక్కు చెల్లింపు

వీపనగండ్ల, నవంబర్ 13: ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, సతీమణి బీరం విజయమ్మ మండల కేంద్రంలోని గంగమ్మ దేవతను దర్శించుకొని ఆభరణాలు అందజేసి మొక్కు చెల్లించి భక్తిశ్రద్ధలతో సోమవారం పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రజలకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కమలేశ్వర్‌రావు, స్థానిక ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు ముంత మల్లయ్య యాదవ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్ బీఆర్ఎస్ నాయకులు కరుణాకర్‌రెడ్డి, శివ, కురుమయ్య, సాయిబాబా ఉన్నారు.

## చేసిన అభివృద్ధి చూపి ఓట్లడగాలి



మాట్లాడుతున్న పెద్దదగడ బీఆర్ఎస్ నాయకులు

చిన్నంబావి, నవంబర్ 13: మాజీ మంత్రి, కొల్లాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి జూపల్లి కృష్ణారావు అభివృద్ధి చేశానని గ్రామాల్లో తిరుగుతూ ప్రగల్భాలు పలకడం కాదు, చేసిన అభివృద్ధి ఎందో చూపించి ఓటు అడగాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఇంద్రాసేనారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పెద్దదగడలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పెద్దదగడ గ్రామాన్ని అభివృద్ధి చేశానని ప్రగల్భాలు పలుకుతున్న మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు నువ్వు చేసిన అభివృద్ధి గ్రామంలోని గుడిని, బడిని కూల్చడమా అని ప్రశ్నించారు. గతంలో నువ్వు మంత్రిగా ఉన్నప్పుడు గ్రామానికి చెందిన మాజీ సర్పంచు భారతమ్మ నాలుగు ఎకరాల భూమి దళితులకు ఇవ్వమని అడిగితే మీరు అధికార దాహంతో కాలయాపన చేసి దళిత వ్యతిరేకిగా మారారని గుర్తుచేశారు. కొల్లాపూర్ అభివృద్ధి ప్రదాత, మా నాయకుడు బీరం హర్షవర్ధన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని అన్నారు. ఈ సమావేశంలో ఉప సర్పంచు కొండయ్య, బీఆర్ఎస్ నాయకులు మైచందర్, పాండయ్యాచారి, భార్గవ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, జింకల ఉన్నారు.

## ఘనంగా దీపావళి వేడుక

పెద్దకొత్తపల్లి, నవంబర్ 13: మండల పరిధిలోని పెద్ద కార్వాముల, యాపట్ల, సాతాపూర్, కల్వకోల్, చంద్రకల్, పెద్దకొత్తపల్లి గ్రామాలలో సోమవారం ఘనంగా దీపావళి వేడుకలను ప్రజలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయాల్లో వేకువజాము నుండే ప్రజలు వెళ్లి దర్శించుకున్నారు. అనంతరం ఇండ్ల దగ్గర బాణాసంచా కాల్చి దీపావళి వేడుకలు జరుపుకున్నారు.

## గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

చిన్నంబావి, నవంబర్ 13: క్రీడాకారులు క్రీడల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలని , ఓటమి గెలుపుకు తొలిమెట్టు అని సర్పంచు ఛక్రదర్‌గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని అమ్మాయిపల్లి గ్రామంలో దీపావళి పండుగను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను కానిస్టేబుల్ వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులతో పరిచయ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు జ్ఞాపశక్తిని, మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చున్నారు. క్రీడలు స్నేహభావంతో ఆడాలని , గెలుపోటములను సమానంగా తీసుకోవాలని , ఓటమి గెలుపుకు తొలిమెట్టు అని అన్నారు. యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకొని జీవితంలో ఉన్నతంగా రానించి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం క్రికెట్ పోటీల నిర్వాహకులను ఆయన అభినందిస్తు క్రీడల్లో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ పోటీల నిర్వాహకులు, గ్రామస్తులు , క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## కబడ్డీ పోటీలు ప్రారంభం



వీపనగండ్లలో కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

వీపనగండ్ల, నవంబర్13ః గంగమ్మ జాతర దీపావళి పండుగను పురష్కరించుకోని మండల కేంద్రంలో రైతు బంధు సమన్వయ సమితి మండలాధ్యక్షుడు ముంత మల్లయ్య ఆధ్వర్యంలో తాలుక స్థాయి కబడ్డీ పోటీలను ఎంపీపీ కమలేశ్వర్ రావు ఆదివారం ప్రారంభించారు. అదేవిదంగా మండలంలోని పుల్గర్‌చర్ల గ్రామంలో యువకులకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు దారా సింగ్, కురుణాకర్ రెడ్డి, బాబు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.